అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



కార్పొరేటర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న హన్మంతరావు తదితరులు

చార్మినార్/దూద్‌బౌలి: సిటీ కాలేజీ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం అనుకూలంగా ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హన్మంతరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సిటీ కాలేజ్ ప్రాంతానికి వచ్చి చౌరస్తాలో విగ్రహం ఏర్పాటు విషయమై పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, సురేందర్ దండుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్ని ఏళ్లుగా పాతబస్తీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కోసం అన్వేషిస్తున్నామన్నారు. పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించినప్పటికీ..విగ్రహం ఏర్పాటుకు అనుకూలంగా లేదన్నారు. సిటీ కాలేజ్ చౌరస్తాలో విగ్రహం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

యాకుత్‌పురాను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: యాకుత్‌పురాను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. యాకుత్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం రెయిన్ బజార్‌లో పార్టీ కార్పొరేటర్లు, మజ్లిస్ నాయకులు, స్థానిక బస్తీవాసులు ఆయనతో కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి స్థానిక సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం, రెయిన్‌బజార్ డివిజన్ల కార్పొరేటర్లు సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, మజ్లిస్ పార్టీ అమన్‌నగర్–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మోహినుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు



చార్మినార్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ఆస్తిపన్ను సమస్యలు మొత్తం ఆరు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, ఏఎంసీ రాజారావు, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనాబి, టౌన్ ప్లానింగ్ సిటీప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు పాల్గొన్నారు.

రూ.1000 కోట్లతో మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ మాల ఐక్య వేదిక ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు ఐక్యవేదిక బృందం వర్గీకరణ వల్ల వచ్చే సమస్యలపై నివేదిక సమర్పించారు. అనంతరం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరా బాలకిషన్ మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన మాల కులస్తులకు మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులను కేటాయించాలని షెడ్యూల్డ్ కులాల జాబితాలో సీరియల్ నెంబర్ 34లో ఉన్న మాల, మాల అయ్యావారు కాకుండా ప్రత్యేక మాల వేరుగా పేర్కొనాలని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగంలోని 344 ఆర్టికల్‌కు వ్యతిరేకం అని కమిషన్ చైర్మన్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ రావు, జంగ్లీ కిషన్, శివశంకర్, నాగరాజ్, నవీన్‌రావ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ఉపాధ్యక్షుడిగా విష్ణుచారి



విష్ణుచారికి నియామకపత్రాన్ని అందజేస్తున్న మదన్‌మోహనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఉపాధ్యక్షుడిగా రాళ్లబండి విష్ణుచారి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫని రవీంద్రచారి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

సూపరింటెండెంట్ రాకేష్ సహాయ్



ఏఎంసీ వార్డులో ఈసీజీ పరీక్షలు చేస్తున్న రాకేష్ సహాయ్

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ రాకేష్ సహాయ్ తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్యాజువాల్టీ, ఏఎంసీ, ఏఎన్ఎస్‌సీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, నెఫ్రాలజీ, యురాలజీ తదితర విభాగాల్లో ఈసీజీ యంత్రాలతో నిరంతరం రోగులకు ఈసీజీ రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. మూడు యంత్రాలకు ఇటీవలే మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మరో మూడు బ్యాక్ అప్ పరికరాలు అందుబాటులో ఉంచామని అత్యవసర సమయంలో వాటిని వినియోగిస్తామన్నారు. ఆసుపత్రిలో కేవలం ఒక్క ఈసీజీ యంత్రం పని చేస్తుందని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఓ పత్రిక (సాక్షి కాదు)లో వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: శ్రీనిత్య నిలయం ఆధ్వర్యంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, నాట్య గురువు డాక్టర్ బాగవతుల సేతూరాం శిష్యురాలు గార్లపాటి మేఘన కూచిపూడి రంగప్రవేశం సోమవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. విఘ్నేశ్వర దరువు, శివ కీర్తన, మహిషాసుర మర్దిని, తరంగం, భామ కలాపం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్‌వ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ.. మేఘన రాబోయే రోజుల్లో పెద్ద నాట్య గురువు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పద్మశ్రీ పురస్కార గ్రహీత డి.ఉమా మహేశ్వరీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, శ్రీకృష్ణ సిల్క్స్ అధినేత రాచకొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు ఫ్రీడమ్

- ఫ్రీడమ్ పార్కులో పనిచేయని సోలార్ దీపాలు
- చీకటి పడితే తిష్టవేస్తున్న పోకిరీలు
- పట్టించుకోని అధికారులు



ఫ్రీడమ్ పార్కులో పనిచేయని సోలార్ దీపాలు



పాడైన సోలార్ ప్లేట్లు



పార్కు పక్కన పడిన మద్యం, బీరు సీసాలు

నాంపల్లి: నాంపల్లి నియోజకవర్గం శాంతినగర్‌లోని ఫ్రీడమ్ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. అందులో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పనిచేయకపోవడంతో చీకటి పడిందంటే అసాంఘింక శక్తులు తిష్టవేస్తున్నాయి. గతంలో పార్కుల్లో విద్యుత్ దీపాలు ఉండేవి. వీటిస్థానంలో 2013లో అప్పటి ఎమ్మెల్యే, దివంగత విరాసత్ రసూల్ ఖాన్, మాజీ మేయర్, ప్రస్తుత నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఈ పార్కులో సోలార్ దీపాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొన్నాళ్లు ఈ దీపాలు బాగానే పనిచేసినా కాలక్రమేణా వీటిపై పర్యవేక్షణ లేక తిష్టిబొమ్మలా మారాయి. వీటిని పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల మూలనపడగా మరికొన్ని దీపాలు ఒరిగిపోయి పనిచేయడం లేదు. కాసేపు సేదతీరుదామని పార్కుకు వచ్చే వారు వీధి దీపాలు లేకపోవడంతో రావడమే మానేశారు. ఇదే అదునుగా చేసుకున్న కొందరు మందు తాగుతూ ఇతరులను భయాందోళనకు గురిచేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ పార్కులో వెలుగులు నింపేందుకు కొత్త దీపాలను అమర్చాలని సందర్శకులు కోరుతున్నారు.

రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



శ్రీదేవి భూదేవి సమేత రంగనాథుడు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి అమ్మవారి ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి జనవరి 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఆలయంలో ఉదయం 5 నుంచి 8 గంటల వరకు గోదా దేవి అమ్మవారి తిరుప్పావై పారాయణం, శత్తుముర్తై, తీర్థ ప్రసాద గోష్టి తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ ప్రతినిధి శృంగారం శేషాచార్యులు తెలిపారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు



అభ్యర్థుల హాల్ టికెట్లను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

విజయనగర్‌కాలనీ: రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పరీక్షకు 480 మంది అభ్యర్థులకు గాను 198 మంది అభ్యర్థులు హాజరుకాగా 282 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ తెలిపారు. నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేయడం వల్ల నిర్ణీత సమయం దాటిన తర్వాత వచ్చిన అభ్యర్థులు నిరాశతో వెనుతిరిగారు.

సమాజ సేవకే జీవితం అంకితం



డాక్టర్ మెట్టు శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: సమాజ సేవకే తన జీవితం అంకితమని తెలంగాణ రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రాష్ట్ర డెంటిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానిక ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పలు శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తున్నామన్నారు. గోషామహల్‌తోపాటు పలు ప్రాంతాల నాయకులు, స్థానికులు మెట్టు శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఐదుగురికి జైలు

విజయనగర్‌కాలనీ: పోలీసుతో దురుసుగా ప్రవర్తించిన ఐదుగురికి న్యాయస్థానం ఐదురోజుల జైలు శిక్ష విధించింది. ఈ ఘటన సోమవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఐదుగురు జాఫర్‌గూడ అన్నపూర్ణ ఆలయం సమీపంలో నిలబడ్డారు. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు వెళ్లి ఇక్కడ ఎందుకు నిలబడ్డారని వారిని ప్రశ్నించారు. అక్కడ నిలబడిన ప్రదీప్ యాదవ్ (36), వై.మధుబాబు (24), శశిధర్ (24), శ్రీనివాస్(39), హరీష్(30)లు ఇదే ప్రాంతంలో ఉంటామని, మీకెందుకు అంటూ పోలీసులను ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని నాంపల్లి 12వ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. దీంతో వారికి న్యాయమూర్తి ఐదు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధించారు.

కురుమలు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో కురుమ కులస్తులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ కురుమ అన్నారు. సోమవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి కోకాపేట్‌లోని దొడ్డి కొమురయ్య భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పోరాడుతున్నా తెలంగాణ ప్రభుత్వం కురుమలపై పక్షపాతం చూపుతూ వారు అభివృద్ధి చెందకుండా చేసిందని విమర్శించారు. త్వరలోనే కురుమ హక్కుల సాధనకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామన్నారు. సంతోష్ కురుమ, ప్రభు పూజారి, సంతోష్ ఉన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంతోష్‌నగర్: బ్రహ్మ ప్రకాశ్ డీఏవీ పాఠశాలలో ఈ నెల 7న భారత డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి సోమవారం బీడీఎల్ యాజమాన్యం బహుమతులు అందజేశారు. బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యూనిట్ హెడ్ రవి, డీజీఎం (హెచ్ఆర్) శ్రీధర్, హెచ్ఆర్ అడ్మిన్, సీనియర్ మేనేజర్ శ్రీరామ్, హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ వెల్ఫేర్ జయదనమ్మ, పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లి, ప్రిన్సిపాల్ ప్రశాంత్, విద్యార్థులను అభినందించారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పలు పార్టీల నాయకులు, కార్పొరేటర్లు

అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించొద్దని అన్ని పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గోషామహల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గోషామహల్ గ్రౌండ్స్ వద్ద ప్లకార్డుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గోషామహల్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆవుల వినోద్ యాదవ్, కోటి శైలేష్‌కురుమ, కార్పొరేటర్లు శంకర్ యాదవ్, లాల్ సింగ్, బీజేపీ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, బంగారు సుధీర్‌కుమార్, టీడీపీ నేత కేడీ ధినేష్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు పాండు యాదవ్‌తో పాటు పలువురు నాయకులు ప్రభుత్వ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించకుండా ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ ముదిరాజ్, వీరేందర్, దుర్గాయాదవ్, రామ్ ముదిరాజ్, పవన్, చంద్రశేఖర్, రవి, సూర్య శుక్లా, భగవాన్ ఉపాధ్యాయ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి



పూజల్లో ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

జియాగూడ: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. సీతారాంబాగ్ పహాడ్‌పై ఉన్న దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు బద్రినాథ్ సింగ్, కోశాధికారి ఠాకూర్ గోపాల్ సింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..నగరంలోనే కాకా తెలంగాణ వ్యాప్తంగా గుట్టపై వెలసిన దత్తాత్రేయ స్వామిని దర్శనం చేసుకుంటే అనుకున్న కోరికలు నెరవేరుతాయన్నారు. ఆలయ నిర్వాహకులు పల్లకీ సేవా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

గోల్కొండ: నానల్‌నగర్ ఫ్లోర్ మిల్ తిరుపల్లి గడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వాముల సన్నిదానంలో సోమవారం అయ్యప్ప పడిపూజ జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌స్వామి అయ్యప్ప దీక్షదారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో సామూహికంగా అయ్యప్ప, సత్యనారాయణ స్వామి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప సన్నిదానం ప్రాంగణంలో 21 మంది అయ్యప్పలతో అయ్యప్ప పడిపూజ, సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు అయ్యప్ప దీక్షదారులకు 21 విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు ఎ.బాలకృష్ణ, అరవింద్, ఎ.సుదర్శన్ ముదిరాజ్, బాలకృష్ణ, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు



సన్నిదానంలో..

శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు



చార్మినార్: అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమల బయలుదేరి వెళ్లారు. సురమాంభ సహిత కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకుని అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. గురుస్వామి రాజేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజల్లో అయ్యప్ప భక్తులు చెవుగోని సాయి రాం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరణలో పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం కేలండర్‌ను సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. అధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మస్నా సతీష్, కోశాధికారి వనం మహేందర్, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం అధ్యక్షుడు గంజి జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి పున్న జనార్దన్, కోశాధికారి బొమ్మ సుదర్శన్ పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ సుస్థిరం



దీపాదాస్ మున్షీతో ఆజామ్‌ఖాన్

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. గోల్కొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆజామ్‌ఖాన్ సోమవారం ఆమెను కలిసి తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ అంటే తనకు ఎంతో ఇష్టమని పెళ్లి వేడుకలు చూడడానికి స్వయంగా తాను తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

నాంపల్లి: పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కార్యవర్గం సభ్యుల బృందంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సోమవారం సచివాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గాజుల నర్సయ్య మాట్లాడుతూ..చాలా కాలంగా మెడికల్ బిల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. హెల్త్‌కార్డులు, పీఆర్సీని వెంటనే ఇవ్వాలని కోరారు. పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఏలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని యాదాద్రి, భద్రాచలం, వేములవాడ ఆలయాల్లో పనిచేసే సిబ్బందికి 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నవనీతరావు, ఉపాధ్యక్షులు మహ్మద్ రఫీ, కోశాధికారి శ్రవణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్.రాములు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజీపురాలో ఘాజీబండకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ సమస్యపై ఈ నెల 7న సాక్షిలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సోమవారం రోడ్డుకు మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న రాధాకృష్ణన్, దురైరాజ్, తూర్పు రామిరెడ్డి

అబిడ్స్: కార్మికుల సంక్షేమమే భారతీయ మజ్దూర్ సంఘ్ ధ్యేయమని ఆ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి దురైరాజ్, అఖిల భారత కార్యదర్శి వి.రాధాకృష్ణన్, తెలంగాణ ప్రాంత ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, నగర అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. కార్మికులు మోసపోకుండా వారిని చైతన్య పరిచే విధంగా ఈ నెల 20వ తేదీ వరకు పలు కార్మిక ప్రాంతాల్లో పర్యటించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి కార్మికులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి కోసం బీఎంఎస్ అండగా ఉండి అహర్నిశలు పాటుపడుతుందన్నారు.